విశాలాంధ్ర
అనకాపల్లి
పేజి నెం. 8
శుక్రవారం 26, ఏప్రిల్, 2024

పెత్తందారుల దుకాణాల ఎదుట
గోతులకే రోడ్డు మరమ్మతులు

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం బి.ఎన్.రోడ్డులో పెత్తందారుల దుకాణాల ఎదుట పడిన గోతులకు తారు రోడ్డు మరమ్మతులు వేసి మమ అనిపించేసారని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇటీవల తాజా మాజీ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి కరణం ధర్మశ్రీ సొంత నిధులతో వేసిన హడావుడి రోడ్లు పలు విమర్శలకు తావిస్తోంది. స్వచ్ఛందంగా సేవ చేసే తత్వమే వుంటే బి.ఎన్. ప్రధాన రహదారిలో చాలాచోట్ల గోతులు వదిలి, పెత్తందారులు, బడాబాబులు ఇళ్ల వద్ద తారు రోడ్డుపై మాస్కులు వేయడంపై పలు ఆరోపణలున్నాయి. "స్వంత లాభం, కొంత మాను" అంటూ సీనియర్లు హితవు పలుకుతున్నారు. నిన్నటి వరకు రోడ్ల మరమ్మతులకు లేని నిధులు, గుత్తేదారులకు ఏ విదంగా వచ్చాయి అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

కోలాహలంగా కె.ఎస్.ఎన్. నామినేషన్

- రాజుకు పసుపు తివాచీ పరచిన చోడ'వరం'

విశాలాంధ్ర - చోడవరం: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కె.ఎస్.ఎన్.ఎస్.రాజు వెంట గురువారం భారీ సంఖ్యలో అభిమానులు రాగా కోలాహలంగా నామినేషన్ వేసారు. సుమారు 50,000 మంది కార్యకర్తలతో స్థానిక వేంకటేశ్వరుని ఆలయం దగ్గర నుండి కొత్తూరు వరకు ర్యాలీగా బయలుదేరి తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ ఏ.జి.చిన్ని కృష్ణకు నామినేషన్ పత్రాలు అందజేశారు. అభిమానులు కోలాహలంతో చోడ'వరం' పసుపు తివాచీ పరచి రాజులకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కె.ఎస్.ఎన్. వెంట టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి బత్తుల తాతయ్యబాబు, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లు నాయుడు, జనసేన ఇన్చార్జి పి.వి.ఎస్.ఎన్.రాజు, బి.జె.పి.మీడియా ఇన్చార్జి ఈర్లె శ్రీరామ మూర్తి, సిరిపురపు శ్రీను, నియోజకవర్గం పరిధిలో గల రావికమతం, రోలుగుంట, బుచ్చయ్యపేట నుండి కార్యకర్తలు, నాయకులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాడుగుల వైసీపీ అభ్యర్థి అనురాధ నామినేషన్

విశాలాంధ్ర - వి.మాడుగుల: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తనయురాలు ఈర్లె అనురాధ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. దేవరాపల్లి మండలం స్వగ్రామం తారువ నుండి మాడుగుల వరకు వేలాది జననీరజనాల మధ్య భారీ ర్యాలీ నిర్వహించారు. ఘాట్ రోడ్డు నుండి జన ప్రభంజనం ఉవ్వెత్తున ఎగిసిపడింది. అనంతరం మాడుగులలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కృష్ణవేణికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. అలాగే డమ్మీ అభ్యర్థిగా అనురాధ తల్లి బూడి రమణమ్మ నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ నియోజకవర్గంలో భారీ మెజార్టీతో తాను గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు గురై లైన్‌మెన్ మృతి

విశాలాంధ్ర - కశింకోట: విద్యుత్ శాఖకు చెందిన వ్యక్తి విధి నిర్వహణలో భాగంగా విద్యుత్ స్తంభం ఎక్కి అక్కడ షాక్‌కు గురై క్రిందపడి మృతి చెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించి యూనియన్ నాయకుల అందించిన వివరాలు ఇలా వున్నాయి. మునగపాక మండలం చూచుకొండ విద్యుత్ కార్యాలయంలో సిపిడబ్ల్యు (కన్సల్టింగ్ పే వర్కర్)గా పీతల శివ సూర్యనారాయణ (38) గత కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా గురువారం విద్యుత్ స్థంభంపై వైరు తెగిపోవడంతో మరమ్మతులు చేస్తుండగా రిటర్న్ సప్లై రావడంతో విద్యుత్ షాక్‌కు గురై పై నుండి క్రింద పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వంద పడకల ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్ఇసిఎస్ ఏపీ ఈపిడిసిఎల్‌లో విలీనం ఆయినప్పటి నుంచి సిపిడబ్ల్యు వర్కర్స్ గాని రెగ్యులర్ వర్కర్స్‌కు గాని ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో విధి నిర్వహణలో ఎవరు చనిపోయిన వారి కుటుంబానికి న్యాయం జరగటం లేదని ఆ కారణం చేత యూనియన్ నాయకులంతా శివ మరణంతో ఒక తాటి మీదకు వచ్చి మృతుని కుటుంబానికి న్యాయం జరగాలని కశింకోట ఆర్.ఈ.సి.ఎస్ వద్ద విధులు బహిష్కరించి ధర్నా చేశారు. సందర్భంగా ఒప్పంద ఉద్యోగస్తుల యూనియన్ అధ్యక్షులు సిద్ధ గోవింద, రెగ్యులర్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.వరదేశినాయుడు, రెగ్యులర్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఎన్.గంగరాజు, కార్యదర్శి ఎం.పరదేశి నాయుడు, ఉపాధ్యక్షులు డి.నూకరాజు తదితరులు మాట్లాడుతూ ఏపీ ఈపీడీసీఎల్‌లో ఆర్ఈసీఎస్ విలీనం అయిన తర్వాత ఇప్పటికీ ఎనిమిది మంది చనిపోగా ఈ మరణం తొమ్మిదోది అని గతంలో చనిపోయిన వారి కుటుంబాలు నేడు ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల కారుణ్య నియామకాలు జరగకపోవడం వల్ల రోడ్డున పడ్డాయి అన్నారు. నేడు శివ కుటుంబం పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉందని మాకు ఎటువంటి సౌకర్యాలు లేవని పీఎఫ్, ఈఎస్ఐ భద్రత కూడా లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో గంగరాజు, వెంకట గోవిందా, రమణ చిన్నరాజు, జగదీష్ పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శిగా పల్లా

విశాలాంధ్ర - పరవాడ: వైసీపీ అనకాపల్లి జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శిగా పరవాడ మండలం రావాడ పంచాయతీ పరిధి బొట్టవానిపాలెం గ్రామానికి చెందిన పల్లా గోవింద్‌ను అధిష్టానం నియమించింది. ఈ మేరకు గురువారం పెందుర్తి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. పార్టీ తన సేవలను గుర్తించి జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి పదవికి ఎంపిక చేసిందని గోవింద్ తెలిపారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో పాటు ఇతర ముఖ్య నేతలకు గోవింద్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

శనివారం గాంధీ
కాయగూరల మార్కెట్ సెలవు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం చెందిన హోల్‌సేల్ కాయగూరలు వర్తకుడు కీర్తిశేషులు కోడూరు వెంకట్రావు మృతికి సంతాపం తెలియజేస్తూ ఈనెల 29 (శనివారం) గాంధీ హోల్‌సేల్ కాయగూరల మార్కెట్‌కు సెలవు ప్రకటిస్తున్నట్టు శ్రీ గౌరీ హోల్‌సేల్ కాయగూరల వర్తక సంక్షేమ సంఘం అధ్యక్షులు కార్యదర్శులు సూరిశెట్టి జగ్గమహేశ్వరరావు (జగదీష్), వై.ఎన్.భద్రం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఆరోజు ఎటువంటి లావాదేవీలు జరగవని రైతులు కొనుగోలుదారులు గమనించాలని కోరారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

18 నామినేషన్లు దాఖలు: ఆరోవో కె.గీతాంజలి

విశాలాంధ్ర - నక్కపల్లి: పాయకరావుపేట నియోజవర్గం అసెంబ్లీ స్థానానికి నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగియడంతో పలువురు నామినేషనన్లు దాఖలు చేశారు. ఇప్పటికి 11 మంది అభ్యర్థులు 18 నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్వో కె.గీతాంజలి తెలిపారు. ఈ మేరకు గురువారం టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత 2 సెట్లు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి బోణి తాతారావు-1, శెట్టిబొతుల ధర్మరాజు (ఇండిపెండెంట్)-1, పరవాడ రామకృష్ణ (ప్రబుద్ధ పబ్లిక్ పార్టీ)-1, కాకర నరసింహరావు (బహుజన సమాజ్ పార్టీ)-1, వైఎస్సార్ పార్టీ డమ్మీ అభ్యర్థిగా కంబాల సందీప్-1 నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఈ నెల 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వో శ్రీకాంత్, జానకి, సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

పోలింగ్ రోజున కార్మికులకు వేతనంతో కూడిన సెలవు

సహాయ కార్మిక కమిషనరు కె.వసంతరావు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: సాధారణ ఎన్నికల పోలింగ్ నిర్వహించే మే 13న కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని కార్మికశాఖ కమిషనర్ యం.వి.శేషగిరిబాబు ఆదేశాలు జారీ చేసినట్లు నర్సీపట్నం సహాయ కార్మిక కమిషనర్ కె.వసంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వున్న కార్మికులందరూ ఓటుహక్కును వినియోగించుకొనుటకు సెక్షన్ 135 బిఆర్‌పి యాక్ట్ ప్రకారం వ్యాపారసంస్థలు, దుకాణాలు, వాణిజ్య సముదాయాలు తదితర సంస్థల యజమానులు తప్పనిసరిగా వేతనం కూడిన సెలవు మంజూరు చేయాలన్నారు. యాజమాన్యాలు ఎవరైనా నిబంధనలను ఉల్లఘించి నట్లయితే జరిమానాతో కూడిన శిక్షకు గురికావలసి వుంటుదన్నారు.

వైసీపీలోకి చేరిన టీడీపీ, జనసేన నేతలు

విశాలాంధ్ర - రాంబిల్లి: అచ్యుతాపురం మండలం పూడిమడక, కడపాలెం గ్రామాల టీడీపీ, జనసేన పార్టీల నుంచి వైసీపీలోకి పలువురు చేరినట్లు ఆ పార్టీ ప్రతినిధులు తెలిపారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజు సమక్షంలో రాంబిల్లిలో గల ఆయన నివాసంలో టిడిపి, జనసేన పార్టీల నాయకులైన మేరుగు సోమన్న, చింతకాయల అప్పలరాజు, సురాడు బాబురావు, మైలపల్లి జగదీష్, కొవిరి మహేష్, పిరాది మారయ్య, మెరుగు రాజయ్య, చెల్లూరు నగేష్, మైలపల్లి ప్రసాద్ తదితరులు వైసీపీలో చేరారు. వీరందరికీ యువి రమణమూర్తి రాజు పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పూడిమడక గ్రామ పెద్దలు నాయకులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధితోనే సమాజ అభివృద్ధి

- విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్ డీజీఎం గిరిధర్ బక్షి

విశాలాంధ్ర - పరవాడ: మహిళా అభివృద్ధి ఎప్పుడు జరుగుతుందో అప్పుడే సమాజా అభివృద్ధి చెందుతుందని విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్ డీజీఎం గిరిధర్ బక్షి అన్నారు. రామ్‌కీ ఫౌండేషన్ సహకారంతో శ్రేయ ఫౌండేషన్ నిర్వహించిన కుట్టు శిక్షణా కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో గిరిధర్ బక్షి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి మహిళలోను కొన్ని ప్రత్యేకమైన నైపుణ్యాలు ఉంటాయని, వాటిని మెరుగుపరుచుకొని ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా మెరుగుపడటానికి ఎంతో తోడ్పడుతుందని పేర్కొన్నారు. రామ్‌కీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ కె.శ్రీకాంత్ మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ధరలు మధ్యతరగతి కుటుంబాలపై పెను భారాన్ని మోపుతున్నాయన్నారు. భర్తతో పాటు భార్య కూడా కొంత ఆదాయాన్ని సంపాదించినప్పుడు కుటుంబాల ఆర్థిక పరిస్థితులు మెరుగు పడటమే కాకుండా జీవన ప్రమాణాల పెరుగుదలకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. శ్రేయ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఉషా మాట్లాడుతూ ఆరు నెలల పాటు రెండు బ్యాచ్‌లుగా 60 మంది మహిళలకు శిక్షణ కార్యక్రమం ఇవ్వగా, ఇందులో పాల్గొన్న మహిళలు ఎంతో శ్రద్ధగా శిక్షణ తీసుకోవడం జరిగిందని చెప్పారు. శిక్షణ పూర్తి అయిన మహిళలకు వివిధ సంస్థలను సంప్రదించి ఉపాధి కల్పించడానికి రామ్‌కి ఫౌండేషన్ సహకారంతో కృషి చేస్తామని చెప్పారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు ధ్రువ పత్రాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో రామ్ కీ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, రాజేశ్వరి, శ్రియ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రభు పాల్గొన్నారు.

నేడు మరిడిమాంబ ఆలయం ప్రారంభం

విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ మండలం ఏఎల్ పురం గ్రామం హాస్పటల్ దగ్గర, మరిడమాంబ ఆలయం ఈనెల 26వ తేదీన ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు చేయనున్నట్టు తెలిపారు. భక్తులు యావన్మంది విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

వైభవంగా కనక మహాలక్ష్మి అమ్మవారి జాతర

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో కర్రివానిపాలెం గ్రామంలో కనకమహాలక్ష్మి అమ్మవారు జాతర వైభవంగా జరిగింది. గురువారం ఉదయం నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ విద్యుత్ అలంకరణ, బాణసంచా కాల్చారు. భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

1న ఉచిత వైద్య శిబిరం



విశాలాంధ్ర - పరవాడ: పరవాడలోని శ్రీ ఆధ్య మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో మే1న ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ బండారు బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్ వైద్య నిపుణులు వైద్య సేవలు అందిస్తారన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. ఇందులో రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయబడతాయని చెప్పారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో అడ్డురోడ్డు తిమ్మాపురం సమీపంలో 20 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్సై ఏ.విభూషణరావు అందించిన వివరాల ప్రకారం మద్యం షాపు సమీపంలో తిమ్మాపురం గ్రామం చెందిన ఒక వ్యక్తి షాపు నుంచి మద్యం సీసాలను కొనుగోలు చేసి పట్టుకొని వెళ్తుండగా పట్టుకోవడం జరిగిందని తెలిపారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తరలించారు.

జగన్ నాటకాలు ఇక చెల్లవు

ఉపాధి లేక వలసపోతున్న ఉత్తరాంధ్ర యువత
30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీరాజ్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రాష్ట్రంలో జగన్ నాటకాలు ఇక చెల్లవని వచ్చేది కూటమి ప్రభుత్వమేనని జనసేన నాయకులు, 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీరాజ్ అన్నారు. కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనకు 25 ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకువచ్చి, రాజధాని నిర్మాణం చేపట్టి విభజన ఆంధ్రప్రదేశ్‌ను ప్రగతి పథంలో నడిపిస్తానని గత ఎన్నికల ముందు ఈ రాష్ట్ర ప్రజలకు నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్మోహన్‌రెడ్డి ఈ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. తాను పదేళ్ల జగన్‌తో కాపురం చేశానని ఆయన విధానాలు నచ్చకే తాను పార్టీ నుంచి బయటకు వచ్చానని తెలిపారు. జగన్ పాలనలో వారి శాఖలపై అవగాహన లేని అంబటి రాంబాబు, రోజా వంటి వారికి పదవులిచ్చి రాష్ట్రాన్ని అయోమయంలో పడేశారన్నారు. అనకాపల్లి నియోజకవర్గం నుంచి సీఎం రమేష్ ఎన్నికయ్యాక కేంద్రమంత్రి అవుతారని, అలాగే ఇక్కడ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న జనసేన పార్టీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ రాష్ట్ర మంత్రి అవుతారని జోష్యం చెప్పారు. ఉత్తరాంధ్రకు సీఎం జగన్ పాలన వలన పరిశ్రమలు రాకపోవడంతో యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కొని ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నిరుద్యోగ సమస్య తీరాలన్నా, పరిశ్రమలు రావాలన్నా సీఎం రమేష్‌ను ఎంపీగా గెలిపించుకోవాలని పృథ్వీరాజ్ కోరారు.

మే 4న ప్రధాని మోదీ అనకాపల్లి రాక

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మే 4వ తేదీన అనకాపల్లికి విచ్చేస్తున్నారని బీజేపీ నాయకులు పరుచూరి భాస్కరరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. జిల్లా బీజేపీ అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పర్యటన విజయవంతం చేసిన మూడు పార్టీల నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా మన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగజగదీశ్వరరావు, గుడాల ముదిరాజ్ సత్యనారాయణ, మళ్ల గణేష్ పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర - పాయకరావుపేట: రానున్న ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడులకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని వైసిపి నాయకులు పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధనిశెట్టి బాబూరావు, జగతా శ్రీను, ధనిశెట్టి తిరుమలేశ్వరరావు, దోమాడ సుందరం, జె.శ్రీను, మధు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుండి జనసేనలోకి వలసలు

విశాలంధ్ర - అచ్యుతాపురం: మండలంలో మదుతూరు గ్రామంలో వైసీపీకి చెందిన పలువురు ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి మోటూరు శ్రీవేణి, గ్రామ పార్టీ అధ్యక్షుడు నీరుకొండ సంతోష్‌ల ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. గురువారం జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి ఎలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే చీమలాపల్లి గ్రామంలో వైసిపికి చెందిన పలువురు జనసేనలోకి చేరారు. ఈ సందర్భంగా సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే మదుతూరు గ్రామాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపి నాయకులు పాల సంఘం అధ్యక్షులు శనివాడ ఆనందరావు, బిజెపి పార్టీ నాయకులు గోవిందా, జనసేన పార్టీ నాయకులు ప్రగడ చిన నాగేశ్వరరావు, శనివాడ నూకేష్, అప్పికొండ శ్రీనివాసరావు, శనివాడ శంకరరావు పాల్గొన్నారు.

జిల్లాకు విచ్చేసిన ఎన్నికల పరిశీలకుల

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఎన్నికల పరిశీలకులు దల్జీత్ సింగ్ మంగత్ ఐఏఎస్, డాక్టర్ రాకేష్ కుమార్ కె.మోహన్ ఎం.దహికర్ గురువారం అనకాపల్లి జిల్లాకు వచ్చారు. వారిని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లు సంసిద్ధత, ప్రణాళికలపై చర్చించారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా జిల్లాలో తీసుకుంటున్న చర్యలు పోలింగ్ కేంద్రాల వద్ద కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, భద్రతాపరమైన ఏర్పాట్లపైన అనకాపల్లి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు తీరుపై చర్చించారు. సాధారణ పరిశీలకులైన దల్ జీత్ సింగ్ (ఫోన్ నం.7569624104) నర్సీపట్నం మాడుగుల చోడవరం నియోజకవర్గాలను. డాక్టర్ రాకేష్ కుమార్ కె. (ఫోన్ నం.7569634085) పెందుర్తి, అనకాపల్లి, ఎలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాలలో ఎన్నికల ప్రక్రియ పరిస్థితులను పరిశీలిస్తారు. మోహన్ ఎం.దహికర్ ఐపీఎస్ (ఫోన్ నం.9347821621) జిల్లాలో ప్రస్తుతం నెలకొని ఉన్న శాంతిభద్రతల పరిస్థితులు, తీసుకున్న ముందస్తు చర్యలు మొదలైన విషయాలను పర్యవేక్షిస్తారు. పరిశీలకులు 25వ తేదీ నుడి జిల్లాలో అందుబాటులో వుంటారని, ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులు వారికి సమర్పించ వచ్చని చెప్పారు.

వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పరిశీలకుల క్యాంపు

అనకాపల్లి టౌన్ గుండాల జంక్షన్‌లో గల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రాంగణంలో పరిశీలకుల క్యాంపు కార్యాలయాలు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా అధికారులు తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఏమైనా సందేహాలు ఫిర్యాదులు ఉన్నట్లయితే పరిశీలకులను కలిసి తెలియజేయవచ్చని తెలిపారు.

కాంగ్రెస్ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్

విశాలాంధ్ర - చీడికాడ: కాంగ్రెస్ పార్టీ మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బొడ్డు శ్రీనివాస్ మాడుగుల ఆర్ఓ కార్యాలయంలో రెండవ సెట్ నామినేషన్ వేశారు. డమ్మీ అభ్యర్థిగా ఆయన భార్య బొడ్డు దేవి నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హస్తం గుర్తుపై ఓటు వేసి తనను, అనకాపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వేగి వెంకటేష్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రొంగలి దేవుడినాయుడు, బండారు ఎరుకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని గోపాలపట్నం గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ కలిదిండి సతీష్ రాజు టీడీపీ పార్టీలో చేరారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత సమక్షంలో పలువురు కార్యకర్తలతో సతీష్ రాజు టీడీపీ చేరారు. పార్టీలో చేరిన వారికి వంగలపూడి అనిత పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, కంకిపాటి వెంకటేశ్వరరావు, గణపర్తి రాజబాబు, గూటూరు శ్రీనివాస రావు, దొర, మైలపల్లి అశోక్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేసి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా -

కూటమి అభ్యర్థి వంగలపూడి అనిత

విశాలాంధ్ర - పాయకరావుపేట: రానున్న ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని కూటమి అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని నామవరం గ్రామంలో ఇంటింటి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వంగలపూడి అనిత మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజవర్గంలో జరిగిన అభివృద్ధి తప్ప, వైసిపి ప్రభుత్వం హయాంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, కంకిపాటి వెంకటేశ్వరరావు, గొర్రెల రాజబాబు, యాళ్ళ వరహాల బాబు, గూటూరు శ్రీనివాసరావు, చించలపు ప్రదీప్, చిక్కాల శ్రీను, మల్లపురెడ్డి రమాకుమారి, పల్లా విలియం కేరి, కురందాసు శివ, గొర్ల లక్ష్మీనారాయణ, ఈగల సూర్యనారాయణ, బోడపాటి శ్రీను పాల్గొన్నారు.

విశాలాంధ్ర
అనకాపల్లి
పేజి: 2
శుక్రవారం 26, ఏప్రిల్, 2024

సర్క్యులర్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: ఉక్కునగరంలో నివసిస్తున్న ఉక్కునగర వాసులపై విద్యుత్ భారాన్ని వేసే సర్క్యులర్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో గురువారం స్టీల్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట పెంచిన విద్యుత్ చార్జీల సర్క్యులర్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ తో ధర్నాను నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ యాజమాన్యం ఏకపక్షంగా ఉక్కునగర వాసులపై అనేక భారాలను మోపుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. అలాగే ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా ఆర్థికంగా చాలా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన వివరించారు. నేడు ఉక్కు పరిశ్రమను పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయకుండా నాసిరకమైన బొగ్గును కొనుగోలు చేసి పరిశ్రమను అదానీ, అంబానీలకు కట్టబెట్టే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను సమర్థిస్తున్న ఉక్కు యాజమాన్యం తన వైఖరిని మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ఆయన హెచ్చరించారు. స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ యాజమాన్యం ఇచ్చిన సర్క్యులర్‌పై గుర్తింపు యూనియన్‌తో సంప్రదించారా అని ఆయన ప్రశ్నించారు. యాజమాన్యం ఇంత ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటుంటే గుర్తింపు యూనియన్ నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించడం దుర్మార్గమని ఆయన అన్నారు. ఆనాడు ఐఎన్‌టీయూసీ కార్మికుల ఒక హక్కుగా ఉన్న హెచ్ఆర్‌ఏపై అనుచిత నిర్ణయం తీసుకుందని, దాని ప్రభావంతో కార్మికులు తీవ్ర నష్టానికి గురిఅయ్యారని ఆయన గుర్తు చేశారు. యాజమాన్యం తక్షణం ఈ సర్క్యులర్ ను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ ఇప్పటికే నూతన వేతనాలు అమలు చేయక నూతన కార్మికులు చాలీచాలని జీతాలతో తమ జీవనాన్ని గడుపు తున్నారని, వీరిపై విద్యుత్ భారాలు మోవడం ద్వారా మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆయన వివరించారు. కార్మికులకు జీతాలు పెంచకుండా అనేక సర్క్యులర్ ద్వారా యాజమాన్యం కార్మిక హక్కులను హరిస్తే తర్వాత జరిగే పరిణామాలకు యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్, స్టీల్ సిఐటియు నాయకులు పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, కృష్ణమూర్తి, కిమోతి బాబు, రాజు, మహేష్, మిత్రపక్షాల నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ఎన్నికల పరిశీలకుడిగా నాయుడు

విశాలాంధ్ర - పెందుర్తి: భారతీయ జనతా పార్టీ పెందుర్తి శాసనసభ నియోజకవర్గం ఇంచార్జ్, ఎన్నికల పరిశీలకుడిగా గొన్న బత్తుల చంద్రశేఖర నాయుడు బాధ్యతలు చేపట్టారు. గురువారం బిజెపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీలో గత 30 సంవత్సరాలుగా వివిధ స్థాయిలలో, ముఖ్యంగా విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షునిగా, పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ గా పనిచేసానని వెల్లడించారు. పూర్వపు లోక్ సభ సభ్యులు కంభంపాటి హరిబాబుతో పనిచేసిన అపారమైన అనుభవం కలిగి ఉన్న తనకు పెందుర్తి నియోజకవర్గం బాధ్యతలను అధ్యక్షురాలు పురందేశ్వరి అప్పగించారని తెలిపారు. గత ఐదు రోజులుగా, కన్వీనర్ గొర్లె రామనాయుడుతో కలిసి నియోజకవర్గంలో పర్యటించి మండల పార్టీ అధ్యక్షులు, ఇతర నాయకులను సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని వేగవంతం చేసినట్లు తెలిపారు. పార్టీలో నాయకులు కార్యకర్తలు అందరిని ఎన్నికల ప్రచారంలో భాగస్వామ్యం చేశామని, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్ తో పాటు పెందుర్తి ఉమ్మడి అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబుకు మంచి మెజారిటీ సాధిస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ లో ప్రస్తుతం ఉన్న రాక్షస ప్రభుత్వాన్ని పైదొలిగించి సుస్థిరమైన పాలన తీసుకురావాల్సి ఉందన్నారు. ఎన్డీఏ కూటమి ఏర్పాటు అయినందున మూడు పార్టీలలో కొందరు ముఖ్య నాయకులు త్యాగాలు చేయాల్సి వచ్చిందని, దీంతో ఆశావహులను బుజ్జగిస్తూ అందరి సహకారంతో కూటమి అభ్యర్థులకు విజయం చేకూరుస్తామని స్పష్టం చేశారు.

జోరుగా మూలపాలెంలో ఎంవీవీ విస్తృత ప్రచారం

విశాలాంధ్ర- విశాఖ సిటీ: అర్హులకు సంక్షేమ పథకాలు అందాలన్నా పేదవాడు అభివృద్ధి లిచెందాలన్నా మరలా ఏపీ ముఖ్యమంత్రిగా జగన్ అన్న పాలన రావాలని గౌ''లు పార్లమెంట్ సభ్యులు, వైసీపీ,తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి సత్యనారాయణ లిఅన్నారులి .లి ఈ మేరకు 96వరోజు గురువారం అప్పుఘర్, మూలపాలెం ,పాదయాత్ర నిర్వహించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భముగా మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు పేదవాడికి పెత్తందారులకు మధ్య జరుగుతున్న ఎన్నికలని అన్నారు.ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత లిఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి చేశారన్నారు.రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఏపీ ముఖ్యమంత్రిగా జగనన్నను మరల ఆశీర్వదించాలని, అలాగే ఇక్కడ తూర్పు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తమను కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రములో మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్ చంద్ర,రాష్ట్ర కార్యదర్శి పీవీ నారాయణ,వాసుపల్లి ఎల్లాజీ, మహిళలు పార్టీ శ్రేణులు, అభిమానులు,పలు కార్పోరేషన్ డైరెక్టర్లు చైర్మన్లు వివిధ అనుబంధ సంఘాల నాయకులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు..

పెందుర్తి ప్రగతి గురించి ఆలోచించి ఓటెయ్యండి

విశాలాంధ్ర - పెందుర్తి: గత పదేళ్లుగా అన్ని విధాల వెనుకబడిన పెం దుర్తి నియోజకవర్గం అభివృద్ధి గురించి ఆలోచించి ఓటు వేయాలని ఇండిపెండెంట్ అభ్యర్థి గుంటూరు వెంకట నరసింహారావు ప్రజలకు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుండి వలస వచ్చిన నాయకులు డబ్బు సంచులతో ఎన్నికల్లో గెలిచేందుకు కుట్రలు చేస్తున్నారని, ప్రజాస్వామివాదుల ందరూ వాటిని గట్టిగా తిప్పుకొట్టాలని విజ్ఞప్తి చేశారు. పెందుర్తి నియోజకవర్గంలో ప్రజల కష్టసుఖాలు క్షుణ్ణంగా తెలిసిన తనకు ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పోటీలో ఉన్న అధికార, ప్రతిపక్ష సభ్యులకు ప్రజల బాగోగుల కంటే సొంత ప్రయోజనాలే ముఖ్యమని విమర్శించారు. పెందుర్తి ప్రాంతం అభివృద్ధిని ఆకాంక్షించే ప్రజాస్వామ్యవాదులందరూ తనకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్ర మంలో స్థానిక ప్రముఖులు నాయకులు పాల్గొన్నారు.

చెక్ పోస్ట్, పోలీస్ స్టేషన్‌లలో
సీపీ రవి శంకర్ ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్/ఆనందపురం: 2024 సాధారణ ఎన్నికల నేపధ్యంలో అడిషనల్ డి.జి.పి, కమీషనర్ ఆఫ్ పోలీస్ అండ్ అడిషనల్ జిల్లా మేజిస్ట్రేట్ డా.ఏ.రవి శంకర్, నగరంలోని పలు ప్రాంతాలలో చెక్ పోస్టులను, పోలీస్ స్టేషన్లనూ, సమస్యాత్మక పోలీంగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశి,పరిశీలించి తగు ఆదేశాలను జారీ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో స్వయంగా సీపీ తగరపు వలస, భీమిలీ క్రాస్ రోడ్, చిన్నాపురం, సత్తరవు , అడవి వరం, సరిపల్లి చెక్ పోస్టులను సందర్శించి, చెక్ పోస్టులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్న విధానమును పరిశీలించి, తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులూ మరియు సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలో మోహరించిన కేంద్ర పోలీసు బలగాలతో పాటు స్థానిక పోలీసులు చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల నిబంధనలు పక్కాగా పాటించాలని సీపీ ప్రజలకు సచించారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర - సాగర్ నగర్: జీవీఎంసీ ఎనిమిదవ వార్డ్ పరిధిలో చిన్న రిషికొండ, ఉమ్మవానిపాలెం ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం నుంచి వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి ఆధ్వర్యంలో టిడిపి ప్రచారం చేపట్టారు. ఇంటింటికి కరపత్రాలు అందించి అసెంబ్లీ ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గం అభ్యర్థి గంటా శ్రీనివాసరావును, ఎంపీ అభ్యర్థి భరత్ కుమార్‌ను గెలిపించాలని అన్నారు . చెట్టు పల్లి గోపి మాట్లాడుతూ వైఎస్ఆర్ పార్టీ గత ఐదేళ్లపాలనలోఏ అభివృద్ధి నోచుకోలేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు జనసేన పార్టీ వార్డు అధ్యక్షుడు శేఖర్ శ్రీనివాసరావు, అబ్దుల్ చౌదరి, అక్కరబోయిన రాంబాబు, లక్ష్మణ్, జయబాబు, బాబురావు, డబ్బాడ రమణ పాల్గొన్నారు.

వీధి కుక్క స్వైర విహారం
8 మందికి గాయాలు

విశాలాంధ్ర - పద్మనాభం: వీధి కుక్క స్వైర విహారం చేసి ఎనిమిది మంది వ్యక్తులను కాటు వేయడంతో గాయాలు పాలయ్యారు. పద్మనాభం మండలంలోని స్థానిక

పాండ్రంగి గ్రామంలో గురువారం వి కుమారి, రమణమ్మ, శ్రీను, బ్రహ్మం, హర్ష , సీతమ్మ, కుమార్‌తో పాటు మరో వ్యక్తిని వీధి కుక్క కరవడంతో పలువురికి తీవ్ర రక్త గాయాలు కాగా, మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. కుక్క కాటుకు గురైన వ్యక్తులందరినీ స్థానిక పద్మనాభం మండల 108 సిబ్బంది విజయనగరం మహారాజ ఆసుపత్రికి వైద్య సికిత్స నిమిత్తం తరలించారు.

మే 1న ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేసేలా ఆదేశాలు ఇవ్వండి

ఈసీ, సీఎస్‌కి లేఖ రాసిన భీశెట్టి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా వృద్ధులకి ఇచ్చే పింఛన్లు మే 1న ఇంటింటికీ పంపిణీ చేసేలా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డికి ఆదేశాలు జారీ చెయ్యాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. గురువారం జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 66 లక్షల మంది పింఛనుదారులు ఉన్నారని 15 వేల సచివాలయాలు, 1,35 వేల మంది సచివాలయం సిబ్బంది ఉన్నారని ఇంటింటికీ పంపిణీ చేయాలనుకుంటే సగటున 440 మంది పింఛనుదారులు ఉంటారని వీరికి అదే గ్రామంలో రెండు మూడు రోజుల్లో సచివాలయం సిబ్బందితో పింఛను ఇప్పించ వచ్చని, ప్రభుత్వం గత నెలలో సక్రమమైన ఏర్పాట్లు చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా 33 మంది వృద్ధులు మృతి చెందారని,ప్రస్తుతం రాష్ట్రంలో ఊహించని స్థాయి లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పింఛను దారులను సచివాలయం చుట్టూ తిప్పడం మంచిది కాదన్నారు,పింఛను పంపకాల చుట్టూ రాజకీయాలు చేరకుండా ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వంకి స్పష్టంగా ఆదేశాలు ఇవ్వాలని భీశెట్టి కోరారు.

మద్యం అమ్మకాలపై దృష్టి సారించండి

రాష్ట్రంలో మద్యం అమ్మకాల్లో చాలా మాతలబులు జరుగుతున్నాయని కొన్నిచోట్ల మద్యం కొనుగోలు దారుడి నుండి డబ్బులు వసూలు చేస్తూ మరికొన్ని చోట్ల కార్డుపై అమ్మకాలు చేస్తున్నారని,బార్లు బార్ల తెరిచిపెట్టి మద్యం దుకాణాలు మూసివేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారని,నగదు రూపంలో జరుగుతున్న అమ్మకాల వెనుక జరిగే మతలబులు పై రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ అధికారులు దర్యాపు చేసేలా ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈసీ, సీఎస్ లకు రాసిన లేఖ ను విడుదల చేసారు, ఈ సమావేశం లోతెలుగుదేశం నేత బొలిశెట్టి శ్రీనివాసరావు పౌరవేధిక ప్రతినిధి కొలసాని రమణ, గిరిజన సంఘం నేత లెంకల విశ్వేశ్వరరావు,పెంటకోట గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దైనందిన జీవితానికి యోగా సరైన మార్గం

టి.ఎస్.వి.ప్రసాదరావు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: దైనందిన జీవితానికి యోగాయే సరైన మార్గం అని రాష్ట్ర పతంజలి యోగాసమితి వైస్ ప్రెసిడెంట్ టి.ఎస్.వి.ప్రసాదరావు అన్నారు. భారత స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జాగ్ క్లబ్ ఆవరణలో పతంజలి యోగ సమితి సహాయోగ ఉపాధ్యాయ శిక్షణ శిబిరంను గురువారం సందర్శించి ప్రత్యేకమైన క్లాస్ తీసుకున్నారు. ఆయన బస్త్రిరిక, కపాలభాతి, అనులోమావిలోమా, ఉజ్జయిని, భ్రామరి, ఉద్గీత, ప్రణవ,ప్రాణాయామాలు ఎప్పుడు చేయాలి, ఎలా చేయాలి, వాటి వలన దైనందిన జీవితంలో జరిగే ఉపయోగాలు గురించి తెలియజేశారు. ఆసనాలు, యోగిక్ జాగింగ్, ఆయుర్వేదం గురించి తెలుపుతూ ప్రతి రోజు మనిషి తన దైనందిన జీవితంలో తప్పనిసరిగా దైనందిన జీవితంలో యోగ సాధన చాలా అవసరమని అన్నారు. ఈరోజుల్లో చాలామంది ప్రజలు మానసిక ఒత్తిడితో, బీపీ, షుగర్‌తో బాధపడుతున్నారని వారు వారు నిత్యం దైనందిన జీవితంలో యోగాను సాధన చేస్తే కొద్ది రోజుల్లోనే ఒత్తిడిని, బిపి, డయాబెటిస్‌ను తగ్గించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఈరోజు క్లాస్ చెప్పిన టి.ఎస్.విప్రసాద్‌రావును ఘనంగా సన్మానించడం జరిగిందని అనకాపల్లి భారత్ భారత్ స్వా భిమాన్ ట్రస్ట్, పతంజలి యోగ సమితి ప్రెసిడెంట్ దొరమనాయుడు తెలిపారు. మంగయ్య మాట్లాడుతూ తమ సంస్థ నిర్వహిస్తున్న సహ యోగ శిక్షణ శిబిరంలో 80 మంది పాల్గొని వారి వారి ఆరోగ్యాలను బాగు చేసుకుంటూ మెలుకువలు నేర్చుకుంటున్నారని తెలిపారు. ప్రతిరోజు యోగాను సాధన చేస్తే మాత్రమే ఫలితం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జాజిగ్ క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శి బిఎస్ఎంకె జోగి నాయడు, బుద్ధ కాశీ విశ్వనాథ్, బీమర్శెట్టి శ్రీనివాసరావు, జి.మంగయ్య, కెవివి సత్యనారాయణ, కాంద్రేగుల చిన్న, కోలాపర్తి కన్నబాబు, పెంటకోట సుబ్రహ్మణ్యం, ఆళ్ల సూర్య రామకృష్ణ, కొణతాల పెద్ద, మల్ల నరసింగరావు, కర్రి గంగాధర్, వంశీధర్, రోహిణి (మహిళాయోగా), రవణమ్మ, బిశెట్టి లక్ష్మి, పి.సత్యనారాయణ, మాదేటి జగన్ పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి పండుగ

విశాలాంధ్ర - పరవాడ: రావాడ పంచాయతీ పరిధి జల్లెలపాలెంలో శ్రీ మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారిని కానుకలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. భక్తులకు తాగునీరు, ఉచిత ప్రసాదం పంపిణీ చేసారు. కోలాటం, తప్పెటగుళ్లు తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. మాజీ జడ్పీటీసీ పైల జగన్నాధరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు సోదరుడు ప్రసాద్, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్న, ఉమ్మడి జిల్లా జనసేన కార్యధర్శి బగిడి రామగోవిందరావు, నాయకులు నగిరెడ్డి చిన్నారావు, వియ్యపు అప్పలనాయుడు తదితరులు అమ్మవారిని ధర్శించుకుని తీర్ధ ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించిన అనంతరం రాత్రికి ఆలయం వద్ద అనుపోత్సవం నిర్వహించారు. ఉత్సవకమిటీ చైర్మన్ మేడిశెట్టి సోమునాయుడు, మేడిశెట్టి గురువునాయుడు, పితాని రామునాయుడు, మేడిశెట్టి శంకర్, పోలవరపు శ్రీను, పోలవరపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోవిందరావు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పరవాడ: జనసేన రూరల్ జిల్లా కార్యదర్శి బుగిడి రామగోవిదరావు జన్మదిన వేడుకలను పరవాడ పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి పార్టీల నాయకులు,కార్యకర్తల మధ్య కేక్ కట్ చేయించి నేతలు

గోవిందరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచారు. మాజీ జడ్పీటీసీ పైల జగన్నాధరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పల నాయుడు, పంచకర్ల రమేష్‌బాబు సోదరుడు పంచకర్ల ప్రసాద్, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్న, సర్పంచులు బొద్దపు శ్రీనివాస్‌కాసులు, మోటూరు సన్యాసినాయుడు,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పి.యం. రాష్ట్రీయ బాల పురస్కార్-2024కు దరఖాస్తులు ఆహ్వానం

స్త్రీ శిశు సంక్షేమ శాఖ పి.డి. అనంతలక్ష్మి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2024నకు అర్హులైన బాలబాలికల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ పి.డి. అనంతలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, సాంస్కృతిక, కళలు, క్రీడలు, సమాజ సేవ, పాండిత్యం, సాహస రంగాలలో అత్యత్తమ ప్రతిభ కనబరిచిన బాలలు పురస్కారాల అర్హులు https: //awards.gov.in ద్వారా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అత్యత్తమ ప్రతిభ కనబరిచిన భారతీయ బాలల(ది 31.07.2024 నాటికి 5 సంవత్సరాలు నిండి, 18 సం.లు దాటని వారు అర్హులని, ఎంపిక కాబడిన బాలలకు గౌరవ భారత రాష్ట్రపతి చేతుల మీదుగా పతకం, నగదు, ధృవ పత్రం అందజేస్తారని చెప్పారు. అర్హులైన బాలలు తేదీ31.07.2024వ గడువు తేది లోగా ఆన్‌లైన్‌లో నామినేషన్లు సమర్పించవలెనని కోరారు. పూర్తి వివరాలు కొరకు https://awards.gov.inలో మార్గదర్శకాలు పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు.

చోడవరం అసెంబ్లీ స్థానానికి 15 నామినేషన్లు

విశాలాంధ్ర - చోడవరం : చోడవరం అసెంబ్లీ స్థానానికి నేటి వరకు 15 నామినేషన్లు అందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అనకాపల్లి ఆర్డీఓ ఏ.జి.చిన్నికృష్ణ గురువారం సాయంత్రం మీడియాకు తెలిపారు. వాటిల్లో వై.సీ.పి. నుండి 4, టి.డి.పి. నుండి 5, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐ.ఎన్.సి.) నుండి 2, బి.ఎస్.పి. తరఫున ఒకరు, సి.పి.ఐ (ఎం.ఎల్) నుండి ఒకరు, ఇండిపెండెంట్లు గా ఇద్దరు నామినేషన్లు అందించినట్లు తెలియజేసారు.

అవినీతి వైసీపీని గద్దె దించాలి

విశాలాంధ్ర - చోడవరం : అనకాపల్లి పార్లమెంట్ పరిధి చోడవరం నియోజకవర్గం లో కూటమి నాయకుల ప్రచారంలో ఉమ్మడి బీజేపీ ఎంపి అభ్యర్థి సి.ఎం రమేష్ మాట్లాడుతూ అవినీతి వైఎస్సార్ ను గద్దె దించాల్సిందిగా పిలుపునిచ్చారు. చోడవరం అసెంబ్లీ కూటమి టీడీపీ అభ్యర్థి కె.ఎస్.ఎన్.రాజు ఆధ్వర్యంలో గురువారం సాగిన ప్రచార కార్యక్రమం లో సిఎం రమేష్ మాట్లాడుతూ ల్యాండ్, శాండ్, లిక్కర్ మాఫియా ద్వారా కోట్లు దోచుకున్నారని దుయ్యబట్టారు. ఈ స్కాంకు పాల్పడిన వాళ్లు కూటమి ప్రభుత్వం రాగానే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. కూటమి విజయం ద్వారా ఏ.పీ ని అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. కె. ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ 12 సంవత్సరాలు రాజ్యసభ సభ్యునిగా పనిచేసిన అనుభవం

గలిగిన సిఎం రమేష్ లాంటి వారు ఎంపి గా గెలిస్తే మన ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్రంలో నరేంద్రమోడీ, రాష్ట్రంలో చంద్రబాబు , అలాగే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా కూటమి ఏర్పాటుకు కృషి చేసిన పవన్ కల్యాణ్ లాంటి విజనరీ లీడర్ షిప్ మన రాష్ట్రానికి అవసరమన్నారు. జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ పీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ బీజేపీ,టీడీపీ,జనసేన కూటమి గెలుపు తథ్యం అన్నారు. కూటమి తరుపున ఎంపి అభ్యర్థి సిఎం రమేష్ ను కమలం గుర్తు, ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ఎన్ రాజు ను సైకిల్ గుర్తు పై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

చోడవరం న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా కాంద్రేగుల

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గా సీనియర్ న్యాయవాది కాంద్రేగుల దేవిడ్ ఎన్నికయ్యారు. స్థానిక బార్ అసోసియేషన్‌లో గురువారం జరిపిన ఎన్నికల్లో తన సమీప ప్రత్యర్థి పోతల ప్రకాష్‌పై 10 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ప్రత్యర్థి ప్రకాష్‌కు 47 ఓట్లు రాగా, దేవిడ్‌కు 57 ఓట్లు పోలయ్యాయి. బార్ అసోసియేషన్ కార్యదర్శిగా గొర్లె కృష్ణవేణి, ఉపాధ్యక్షుడుగా శ్రీనాదు ప్రసాద్, సంయుక్త కార్యదర్శి గా బి.పైడిరాజు, కోశాధికారిగా ఆర్.ఎస్.ప్రసాద్ నాయుడు, లైబ్రరీ కార్యదర్శిగా దొగ్గ శివ ప్రసాద్, మహిళ రిప్రజెంటేటివ్‌గా ఎస్.వరలక్ష్మి ఎన్నికయ్యారు. న్యాయవాదుల హక్కుల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని కొత్త కమిటీ హామీ ఇచ్చారు.